بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

**Summary of Friday Sermon Hadhrat Khalifatul Masih V 16.08.2019 (Telugu)**

# ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప బద్రి అనుచరులైన హజ్రత్ ఖతాదహ్ బిన్ నుమాన్ అన్సారి, హజ్రత్ అబ్దుల్లాహ్ బిన్ మజ్ఊన్ రజియల్లాహు అన్‌హుమా సద్గుణముల విశ్వాసభరిత ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 16.08.2019 తేదీన - మస్జిద్ బైతుల్ ఫుతూహ్, మోర్డన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. గత చాలా కాలము నుండి కొనసాగుచున్న విధంగా నేడు కూడ నేను బద్రి అనుచరుల గురించి ప్రస్తావింతును.

మొదటి అనుచరులు హజ్రత్ ఖతాదహ్ బిన్ నుమాన్ అన్సారి. హజ్రత్ ఖతాదహ్ అన్సార్‌లోని ఖజ్‌రజ్ వంశమైన బనూ జఫర్‌కు చెందినవారు. వీరి తండ్రి పేరు నుమాన్ బిన్ జైద్, తల్లి పేరు అనీసా బిన్తె ఖైస్. ఖతాదహ్‌కు అబూఉమర్‌తో పాటు అబూ అమర్, అబూ అబ్దుల్లాహ్ అని ఉర్ఫ్ యుండెనని చెప్పుకుంటారు. 70 మంది అనుచరులతో కలిసి హజ్రత్ ఖతాదహ్‌కు అఖ్బ బైఅత్‌లో పాల్గొను అనుగ్రహము లభించెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం నియమించిన విల్లుకారులలో వీరొకరు. వీరు బదర్, ఉహద్, ఖందక్ యుద్ధములతో పాటు తరువాత సంభవించిన యుద్ధములన్నిటిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొను అనుగ్రహము పొందిరి. ఉహద్ యుద్ధము రోజున హజ్రత్ ఖతాదహ్ కంటికి బాణము తగిలినందున వారి కంటి గుడ్డు బయటికి వచ్చెను. వారు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లనిరి. ఓ రసూలుల్లాహ్! ఈ బాణము తగిలినందున నా కంటి గుడ్డు బయటికి వచ్చినది. అప్పుడు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ కంటి గుడ్డును తన హస్తముతో తిరిగి పెట్టగా అది సరియైన చోట అమర్చబడెను. అనంతరం చూపు తిరిగి వచ్చెను. వృద్ధాప్యములో కూడ రెండు కన్నులలోని ఈ కన్ను ఎక్కువ గట్టిగా, బాగుగా యుండెను. ఒక కథనము ప్రకారము ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం ఆ కంటికి తన నోటి ఉమ్ము అంటించిరి. ఫలితముగా రెండు కన్నులలో అది ఎక్కువ అందంగా కనిపించేది. హజ్రత్ ఖతాదహ్ తన ఈ సంఘటనను స్వయముగా ఇట్లు తెలుపుతారు. ఉహద్ యుద్ధము సందర్భమున నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముఖము ముందటికి వచ్చితిని. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ముఖమునకు నేను కవచంగా ఉండాలనే ఉద్ధేశముతో నిలబడితిని. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం పైకి వచ్చుచున్న బాణమునకు నేను నా తల దానికి అడ్డంగా పెట్టేవాడిని. ఇంతలోనే ఒక బాణము నా కంటికి తగిలెను. ఫలితముగా నా కంటి గుడ్డు బయటికి వచ్చి చెంపపై యాలాడుచుండెను. నేను ఆ కంటి గుడ్డును నా చేతిలో పెట్టుకొని రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు హాజరైతిని. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దానిని నా చేతిలో చూడగానే కన్నీరు ఆపుకోలేక పోయిరి. అనంతరం ఇట్లు దుఆ చేసిరి. ఓ అల్లాహ్! ఖతాదహ్ తన ముఖము ద్వారా నీ ప్రవక్త ముఖమును రక్షించెను. కావున నీవు ఇతని ఈ కంటిని రెండు కన్నులలో ఎక్కువ అందముగా ఎక్కువ చూపు కలిగి వుండేటట్లు చేయుము. ఫలితముగా ఆ కన్ను రెండు కన్నులలో ఎక్కువ అందముగా ఎక్కువ చూపు కలిగి వున్నదిగా మారెను.

హజ్రత్ ఖతాదహ్ ఖందక్ యుద్ధముతో పాటు ఇతర యుద్ధములన్నిటిలో ఆఁహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. మక్కా విజయము సందర్భమున బనూ జఫర్ తెగ పతాకము హజ్రత్ ఖతాదహ్ పట్టుకొనిరి. హజ్రత్ ఖతాదహ్ 65 సం॥ల వయసులో హిజ్రి 23వ సం॥లో మృతి చెందిరి. హజ్రత్ ఉమర్ మదీనాలో వారి జనాజ నమాజ్ చదివించిరి.

హజ్రత్ ఖతాదహ్ బిన్ నుమాన్ రజియల్లాహు తఆలా అన్‌హు ఇట్లనిరి. అన్సార్‌లోని ఒక కుటుంబమును బనూ అబీరక్ అనేవారు. వారు ముగ్గురు సోదరులు. వారు మూర్ఖత్వ కాలములోను ఇస్లాం కాలంలోను పేదవారిగా

వుండిరి. వారిలో ఎలాంటి మార్పు రాలేదు. పని చేయక పోవడం, కష్టపడేవారు కానందున పేదవారిగానే వుండిరి. ఖతాదహ్ ఇట్లనిరి. ఒక సారి నా చిన్నాన రఫా బిన్ జైద్ గోదాము గోడకు రంధ్రము చేసి దొంగలు లోపలికి వచ్చి ధాన్యముతో పాటు ఆయుధములన్నిటిని దొంగలించిరి. ఉదయం నా చిన్నాన నా వద్దకు వచ్చి నేటి రాత్రి నాపై పెద్ద దౌర్జన్యము జరిగినదనిరి. ఎవరో మా గోదాము గోడకు రంధ్రము చేసి ధాన్యముతో పాటు ఆయుధములన్నిటిని దొంగలించిరి. నేను చుట్టు ప్రక్కల తెలుసుకొనుటకు చాలా మందిని ప్రశ్నించినాను. మేము నేటి రాత్రి వంట వండుకొంటుండగా బనూ అబీరక్‌ను చూచినాము, మీ ధాన్యముతోటే వారు సంబరాలు జరుపుకున్నారని మా అంచనా అని మంది చెప్పినారు.

నా చిన్నాన నాతో ఇట్లనిరి. ఓ నా సోదరుని కుమారుడా! నువ్వు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వెళ్లి ఈ దుర్ఘటనను ప్రస్తావించినచో నా సామాగ్రి నాకు లభించునని నేను ఆశించుచున్నాను. హజ్రత్ ఖతాదహ్ ఇట్లనిరి. ఈ విషయము విని నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు హాజరై ఇట్లు వేడుకొంటిని. మాలోనే కొందరు దౌర్జన్యమునకు పాల్పడిరి. వారు నా చిన్నాన రఫా బిన్ జైద్ ఇంటికి వెళ్లి వారి గోదామునకు రంధ్రము చేసి వారి ఆయుధములతో పాటు ధాన్యము దొంగలించారు. ఈ విషయము బనూ అబీరక్‌నకు తెలియగా వారందరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి ఇట్లనిరి. ఓ అల్లాహ్ ప్రవక్తా! ముస్లిములమైన, మంచి వ్యక్తులమైన మాపైనే ఖతాదహ్ బిన్ను'మాన్, వారి చిన్నాన సాక్ష్యము, ఆధారము లేకుండానే దొంగతనం నింద మోపుచున్నారు. ఖతాదహ్ ఇట్లనిరి. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం నాతో ఇట్లనిరి. మంచి ముస్లిములమైన వ్యక్తులపై నువ్వు సాక్ష్యము, ఆధారము లేకుండానే దొంగతనం నింద మోపుచున్నావు. ఖతాదహ్ ఇట్లనిరి. నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దగ్గరి నుండి తిరిగి వచ్చితిని. అప్పుడు నా మనసు ఇట్లనెను. నేను కొంత ధనము కోల్పోయినా సరే ఈ విషయములో నేను రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో చర్చించకుంటే బాగుండేది. ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మాటలను విని అనవసరంగా నేను ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంను ఇబ్బంది పెట్టినానని భావించుకొంటిని.

సువార్తవాణి ద్వారా ఆంహజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అల్లాహ్ తఆలా వాస్తవము తెలిపెను. దీని గురించి పవిత్ర ఖుర్ఆన్ సూక్తులు అవతరించినప్పుడు దొంగతనం ఆరోపణను ఎదుర్కొంటున్న బనూ అబీరక్ ఈ సూక్తులు మా గురించే అవతరించినవని భావించి దొంగతనమును ఒప్పుకొని, ఆయుధములు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంనకు అప్పగించిరి. ఆ ఆయుధములను వారు సల్లల్లాహు అలైహి వసల్లం రఫాకు ఇచ్చిరి.

హజ్రత్ అబూసయీద్ ఖుద్రి (రజి) ఇట్లు ఉల్లేఖించిరి. హజ్రత్ ఖతాదహ్ బిన్ను'మాన్ ఒక సారి రాత్రంతా ఇఖ్లాస్ అధ్యాయమును పఠించుచు గడిపిరి. నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం వద్ద ఈ విషయము ప్రస్తావించ బడినప్పుడు వారు సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. నా ప్రాణము ఎవరి హస్తములో వున్నదో ఆ అల్లాహ్ ప్రమాణముగా ఇఖ్లాస్ అధ్యాయము ఖుర్ఆన్‌లోని అర్ధ భాగము లేదా మూడవ భాగమునకు సమానము. అనగా దైవ ఏకత్వమే పవిత్ర ఖుర్ఆన్. పవిత్ర ఖుర్ఆన్‌లో దీని బోధనే బోధించబడెను.

అబూసల్మా ఇట్లనిరి. మాకు హజ్రత్ అబూహురైరహ్ (రజి) రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఈ హదీసు తెలిపేవారు. వారిట్లనిరి. శుక్రవారము రోజున ఒక ఘడియ ముస్లిమునకు లభించును. అతడు ఆ ఘడియలో నమాజ్ చేస్తున్నచో, అల్లాహ్‌తో మంచిని కోరుచున్నచో అల్లాహ్ తఆలా అతనికి దానిని ప్రసాదించును. హజ్రత్ అబూహురైరహ్ (రజి) తన చేతితో చూపుచు ఆ ఘడియ చాలా చిన్నదని తెలిపిరి. హజ్రత్ అబూహురైరహ్ (రజి) మృతి చెందినప్పుడు అల్లాహ్ ప్రమాణముగా నేను హజ్రత్ అబూసయీద్ ఖుద్రిని కలిసినప్పుడు ఆ ఘడియ గురించి తప్పక అడుగుతానని నేను నా మనసులో భావించితినని హజ్రత్ ఖతాదహ్ తెలిపిరి. బహుశ వారికి తెలిసి వుండవచ్చును. కనుక నేను ఒక సారి వారిని కలిసినప్పుడు వారిని ఇట్లడిగితిని. శుక్రవారము రోజున వచ్చే ఒక ఘడియ గురించి మాకు హజ్రత్ అబూహురైరహ్ (రజి) తెలిపిరి. దుఆ ఆమోదించబడు ఆ ఘడియ గురించి మీకు తెలసా? వారిట్లనిరి. ఆ ఘడియ గురించి నేను నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లంను అడిగితిని. కాని నబీ కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లు సమాధానమిచ్చిరి. ముందుగా నాకు ఆ ఘడియ గురించి తెలుపబడెను. కాని షబె

ఖదర్ (విలువైన రాత్రి) వలె అది నాకు గుర్తు లేకుండా పోయెను.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్‌లోని ఒక కథనములో ఆ రోజు ఘడియ గురించి వివిధ కథనములు ప్రస్తావించబడినవి. ఆ కథములతో మూడు వేర్వేరు సమయములు తెలియును. మొదటి కథనము ప్రకారము జుమా నమాజ్‌లో వచ్చును. రెండవ కథనము ప్రకారము ఆ రోజు చివరి సమయములో వచ్చును. మూడవ కథనము ప్రకారము అస్ర్ నమాజ్ తరువాత వచ్చును. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం జుమా రోజు గురించి ప్రస్తావించుచు ఇట్లనిరని హ॥జ్రత్ అబూహురైరహ్ (రజి) ఇట్లు ఉల్లేఖించిరి. ఇందులో ఒక ఘడియ వచ్చును. ఒక ముస్లిం దాసుడు ఈ ఘడియలో నమాజ్ చదువుచు అల్లాహ్ తఆలాతో ఏమి అడిగినా అల్లాహ్ తఆలా అతనికి తప్పక నొసంగును. ఆ ఘడియ చాలా చిన్నదని తన హస్తముతో సంజ్ఞ చేసిరి. సహీ ముస్లింలో ఇట్లు ప్రస్తావించబడెను. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఇమామ్ కూర్చున్నప్పటి నుండి నమాజ్ ముగిసే లోపు ఆ ఘడియ వచ్చును. రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరని హ॥జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలాం (రజి) ఉల్లేఖించిరి. అది సాయంత్రము వచ్చును. అనగా సూర్యాస్తమయం కంటే ముందు. అది నమాజ్ చదవలేని ఘడియనా? అని హ॥జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ సలాం (రజి) వేడుకొనిరి. వారిట్లనిరి. ఎందుకు కాదు! విశ్వాసి పమాజ్ చదివిన తరువాత నమాజ్ నిరీక్షణలో కూర్చొని వున్నచో అతడు నమాజ్‌లోనే వున్నట్లగును.

మరో హదీసులో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరని హ॥జ్రత్ అబూహురైహ్ (రజి) తెలిపిరి. అది అస్ర్ నమాజ్ తరువాత వచ్చును. మరో కథనములో ఇట్లు గలదు. ఆ ఘడియ గురించి హ॥జ్రత్ అబూసల్మా (రజి) అడుగగా రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. **'ఆఖురు సాఅతి నహారిన్'** అది సూర్యాస్తమయం కంటే ముందు వచ్చును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ విషయమును వివరించుచు తఫ్సీర్‌లో ఒక చోట హ॥జ్రత్ ముస్లిహ్ మౌవూద్ రజియల్లాహు తఆలా అన్‌హు ఇట్లనిరి. జుమా, రమజాన్‌లో పరస్పరం చాలా పోలిక గలదు. అదేమనగా జుమా రోజు దుఆలు ఆమోదించబడును. రమజాన్ నెలలో కూడ దుఆలు ఆమోదించబడును. జుమా గురించి రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం ఇట్లనిరి. ఒక వ్యక్తి నమాజ్ కొరకు మస్‌జిద్‌నకు వచ్చి మౌనముగా కూర్చొని దైవస్మరణలో నిమగ్నమై, ఇమామ్ కొరకు నిరీక్షించి, తరువాత మౌనముగా ఖుత్బా విని, నమాజ్ బాజమాఅత్‌లో పాల్గొన్నచో అతనిపై అల్లాహ్ తఆలా ప్రత్యేక శుభములు అవతరించును. జుమా రోజు ఒక ఘడియ వచ్చును. అందులో మానవుడు ఏ దుఆ చేసినా అది ఆమోదించబడును.

వారిట్లు వ్రాసిరి. దైవ శాసనము ప్రకారము ఈ హదీసుకు భావార్థం తప్పక చేయవలెను. అల్లాహ్ తఆలా సున్నత్, దైవ శాసనము ప్రకారమున్న దుఆలే ఆమోదించబడును. ఇదొక అద్వితీయ వరమైనను అతి సులభమైన విషయమేమి కాదు. జుమా సమయము రెండవ అజాన్ లేదా అంతకంటే ముందే ప్రారంభమై నమాజ్ ముగిసేంత వరకుండును. ఈ రెండు సమయములను కలిపినచో ఒక గంట నుండి గంటన్నర సమయమగును. ఈ గంట లేదా గంటన్నరలో మానవుడు చేసే దుఆ ఆమోదించబడు ఒక ఘడియ వచ్చును. కాని ఈ 90 నిమిషములలో మొదటి నిమిషము దుఆ ఆమోద సమయమా! లేక రెండవ నిమిషము దుఆ ఆమోద సమయమా! లేక మూడవ నిమిషము దుఆ ఆమోద సమయమా! 90 నిమిషముల వరకు అందులో ఏ ఘడియ దుఆ ఆమోద ఘడియో మానవుడు చెప్పలేడు. ప్రతి దుఆ ఆమోదించబడు ఘడియను 90 నిమిషములలో అన్వేషించవలెను. 90 నిమిషముల వరకు దుఆలో నిమగ్నమై వుండుట, శ్రద్ధను కేంద్రీకరించుట చాలా కష్టమైన విషయము. కావున ఇది చాలా శ్రమించాల్సిన విషయము. ఇందుకు చాలా కష్ట పడవలసి వుండును. ధ్యానము చెదిరిపోకుండా వరుసగా దుఆ చేయుట ఎంతో ముఖ్యము. జుమా శుభములను పొందుటకు చాలా శ్రమించవలసి వుండును.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. నేను ప్రస్తావించనున్న రెండవ అనుచరుని పేరు అబ్దుల్లాహ్ బిన్ మజ్‌వూన్. వీరు ఖురైష్ తెగ బనూ జమాకు చెందినవారు. వీరు హ॥జ్రత్ ఖుదామహ్ బిన్ మజ్‌వూన్, హ॥జ్రత్ సాయిబ్ బిన్ మజ్‌వూన్ సోదరులు. వీరందరు హ॥జ్రత్ అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ మామయ్యలు.

అబ్దుల్లాహ్ బిన్ మజ్‌వూన్. హ॥జ్రత్ ఖుదామహ్ బిన్ మజ్‌వూన్ ఇద్దరు రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి

వసల్లం దారె అర్ఖమ్‌నకు మారి ఇస్లాం ప్రచారము చేయకముందే ఇస్లాం స్వీకరించిరి. వీరు తమ సోదరులతో కలిసి (Abyssinia) ఎబిసీనియాకు వలస పోయిరి. ఖురైష్‌లందరు ఇస్లాం స్వీకరించారని ఎబిసీనియలో వుండగా వారికి సమాచారమందినది. కావున వారందరు తిరిగి వచ్చిరి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ విషయమును గతములో కూడ నేను ప్రస్తావించాను. ముస్లిముల బాధలు హద్దులు దాటినప్పుడు ఎబిసీనియాకు వలస పోవాలని ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచించుచు ఇట్లనిరి. ఎబిసీనియా (Abyssinia) చక్రవర్తి న్యాయవర్తి, మంచి స్వభావికుడు. అతని రాజ్యములో ఎవరిపై దౌర్జన్యము జరగదు. ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం సూచన మేరకు నబ్వీ 5వ సం॥లో 11 మంది పురుషులు, 4 గురు స్త్రీలు ఎబిసీనియాకు వలస వెళ్లిరి. ఎబిసీనియా చేరుకోగా ముస్లిములకు మంచి శాంతియుత జీవితము లభించినది. తద్వారా ఖురైషీల హింసలతో వారికి విముక్తి లభించెను. కాని కొందరు చరిత్రకారుల కథనము ప్రకారము ముస్లిములు అక్కడికి చేరుకొన్న తరువాత కొద్ది కాలములో ఖురైషీలందరు ముస్లిములు అయినారని వారికి సమాచారము అందెను. దీని వలన వారు ఆలోచించకుండానే తిరిగి వచ్చేసిరి. వీరు మక్కా సమీపమునకు చేరుకొన్నప్పుడు ఇది అపోహ మాత్రమే, వలసదారులను ఎబిసీనియా నుండి తిరిగి రిప్పించుటకు ఖురైషీలు పన్నిన ఒక కుట్ర అని తెలిసెను. కావున వారు ఎంతో అయోమయ పరిస్థితికి గురైరి. కొందరు మార్గమధ్యలోనే తిరిగి వెళ్లిపోగా మరికొందరు తమకు తెలిసిన నాయకుల రక్షణలో మక్కాకు వచ్చిరి. కాని ఆ రక్షణ కూడ చాలా కాలము వరకు నిలువలేదు. ఖురైష్ హింసలు పెరిగిపోయినవి. ముస్లిముల కొరకు మక్కాలో ఎలాంటి శాంతియుత ప్రదేశము లేకుండెను. అప్పుడు ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వలస పోవాలని అనుచరులను మరల ఆదేశించిరి. కావున కొందరు ముస్లిములు రహస్యముగా వలస పోవుటకు సన్నాహాలు చేసుకొనిరి. అవాకశము దొరికినప్పుడు చిన్న చిన్నగా బయలు దేరడం మొదలు పెట్టిరి. ఈ రకంగా వలస పరంపర మొదలైనది. తుదకు ఎబిసీనియాలో వలసదారుల సంఖ్య వందకు చేరినది. వీరిలో 18 మంది స్త్రీలు వుండగా మిగతా మంది పురుషులే. హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ మజ్‌వూన్ మొదటిసారి ఎబిసీనియాకు వలస పోయి తిరిగి వచ్చేసిరి. రెండవసారి తిరిగి వలస పోయినారా లేదా అనే విషయము తెలియదు.

హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ మజ్‌వూన్ తన ముగ్గురు సోదరులు హ్రజత్ ఉస్మాన్ బిన్ మజ్‌వూన్, హ్రజత్ ఖుదామా బిన్ మజ్‌వూన్, హ్రజత్ సాయిబ్ బిన్ మజ్‌వూన్‌తో కలిసి ఆంహ్రజత్ సల్లల్లాహు అలైహి వసల్లం వెంట బదర్ యుద్ధములో పాల్గొనిరి. హ్రజత్ అబ్దుల్లాహ్ బిన్ మజ్‌వూన్ బదర్ యుద్ధముతో పాటు ఉహద్, ఖందక్, ఇతర యుద్ధములన్నిటిలో రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లంతో కలిసి పాల్గొనిరి. వీరు హ్రజత్ ఉస్మాన్ ఖిలాఫత్ హయాంలో హిజ్రి 30వ సం॥లో 60 సం॥ల వయసులో మృతి చెందిరి. ఈ అనుచరుల స్థాయి అంతస్థులను అల్లాహ్ తఆలా పెంచుగాక!

☆☆☆

*(Summary: Office Nashr-o-Isha'at, Translation: Incharge Telugu Desk)*

BOOK POST (PRINTED MATTER)

| From, | To, |
|---|---|
| ................................................ | ................................................ |
| ................................................ | ................................................ |
| ................................................ | ................................................ |
| ................................................ | ................................................ |